# 19. ఫొటో

ఎండ మండిపోతోంది. వడగాలికి భయపడి చాలామంది ఇళ్ళలో తలుపులు బిడాయించుకున్నారు. విధిలేక బైట తిరగవలసిన బహు కొద్ది మందిలో వీరమ్మ ఒకతె.

గడిచిన ఐదేళ్ళుగా ఆమె దినచర్య ఒకే విధంగా వుంటోంది. సూర్యునితో పాటే మేల్కోవటం, బజారుకు వెళ్ళి వేరుసెనక్కాయలు కొనుక్కు రావటం, పప్పులు వొలవటం, ఆ తరువాత బెల్లం పాకం పట్టి  ఉండలు చేయటం, అవి ఆరి గట్టిపడుతుండగా అన్నం వొండుకొని తినటం, మెతుకులు గొంతు దిగకుండానే ఆ ఉండల్ని జంగిడీలో పెట్టుకొని నాలుగు బజార్లు తిరగడం, సరిగ్గా మూడు గంటల వేళకు, మిడిల్ స్కూలు బైట వున్న రావి చెట్టు కింద బళ్ళో చదువుకునే పిల్లలు ఆట విడుపుకు రావటాన్ని ఎదురుతెన్నులు చూడటం, సాయంత్రందాకా అక్కడే పడివుండి, పిల్లలందరూ యింటికి వెళ్ళాక, తాను కాళ్ళీడ్చుకుంటూ యింటికి రావటం జరుగుతూనే వుంది.

వానకానీ, గాలివానకానీ, ఎండకానీ, చలికానీ ఆమెకు యీ విధులు ఏ మాత్రం తప్పవు. స్కూలు సెలవు దినాల్లో ఆమె మరింత కష్టపడాలి. ఒక చోట కూర్చుంటే బేరం రాదు కనుక, మరో నాలుగు బజార్లు తిరగాలి. యీ విధంగా ఆమె వ్యాపారం చేసుకొని పొట్టపోసుకుంటోంది.

ఇవ్వాళ స్కూలు వున్నది. ఎలాగైనా ఆటవిడుపు సమయానికి అక్కడికి చేరాలి. కాని యీ నిప్పులు చెరిగే ఎండ తన పాలిటి మృత్యువుకు ప్రతి రూపమల్లే, తన పట్ల విరోధాన్ని సాధిద్దామనేటంత తీవ్రతరంగా వుంది. ఇప్పటికే ఆమె మొహం నుంచి

చెమట ధారలుకట్టి ప్రవహిస్తూ వుంది. ఎక్కడన్నా నీడను కాసేపు కూర్చుంటే తప్ప కాలు సాగేట్లు లేదు.

ఫోటో స్టూడియో పక్కగా కాస్త నీడ వుంటే చదికిలబడింది. బజార్లోకి చూస్తే ఎండకు కన్నులు మిరుమిట్లు గొల్పుతున్నవి. తన యీ ముసలితనంలో ఎన్ని బాధలు పడవలసివస్తోందో ఆమె తలుచుకోసాగింది. బాధల్ని గూర్చి విచారించవలసిన తీరిక యిప్పుడు చిక్కటం వల్లే, ఆమె కా జ్ఞాపకాలు ఇసక పాతర తవ్వినట్లయింది.

ఒకప్పుడు తనూ సుఖపడిన జీవే! సరిగ్గా పదేళ్ళ క్రితం తనూ, భర్తా ... అమ్మాయీ, హాయిగా కాలం గడిపేవాళ్ళు. తాను ఒక పక్క తల్లిగా, మరొక పక్క భార్యగా ఉన్నంతలో, ఒకర్ని అర్థించవలసిన పని లేకుండా రోజులు దొర్లించేది. భర్త ఫ్యాక్టరీలో పని చేసి జీతం తెచ్చేవాడు. తాను ఇల్లు సర్దుకొని, అమ్మాయితో ఆడుకొంటూ సాయంత్రం భర్త రాకకు ఎదురుచూస్తూండేది.

ఆ రోజుల్లో మార్పు వొస్తుందని ఆమె కలలో కూడా అనుకోలేదు. ఒక నాటి సాయంత్రం భర్త రాకకు ఎదురుచూసే సమయంలో, అతనికి మారుగా అతని శవం వొచ్చింది. ఫ్యాక్టరీలో జరిగిన ఒకానొక ప్రమాదంలో అతను మరణించాడు. పెద్దలు జేరి పంచాయతీ చేసి అదంతా అతని నిర్లక్ష్యమేనని కూడా తేల్చారట!

తానూ, కూతురూ గుండెలు అవిసేటట్లుగా ఏడ్చారు. ఎంత ఏడ్చి ఏం లాభం? జీవితమంతా ఏడవవలసినదాన్ని ఒక్క రోజులోనే ఏడవటం ఎంత కష్టం!...

దినవారాలు పూర్తయాక, ఇక యీ జీవితాల్ని తెల్లవార్చటమెలాగో అర్థం కాలేదు. ఇరుగు పొరుగులు ఎంతో దయగా, సానుభూతులైతే చూపారు కాని, తన స్థితిలోనే వున్న వారి కుటుంబాల నుండి సహాయాన్ని తాను అర్థించనూరాదు, అర్థించినా అది లభ్యమవనూ అవదు.

కొంతమంది పెద్దలు కల్పించుకొని ఫాక్టరీ యజమానుల దగ్గరికి వెళ్ళి, చితికిపోయిన సంసారం విషయమై ప్రస్తావించారు. కిందా మీదా పెట్టగా 'రూల్స్' ప్రకారం కాకుండా ఏదో మానవత్వాన్ని ప్రదర్శించేందుకు గాను అంటూ, ఫాక్టరీ యజమానులు ఐదొందల రూపాయిలిచ్చారు.

ఆ ఐదొందల్తోనే తానూ, తన ముద్దు బిడ్డా శేషజీవితాల్ని వెళ్ళబుచ్చాలి. ఇక బతికేందుకే తాను ఆస్కారం లేదని భయపడి ఛస్తున్న తనకు యీ ఆధారం దొరికింది. అయితే ఆమె భయం తగ్గలేదు. కూర్చొని తింటే ఏమౌతుందో ఆమెకు తెలుసు. సాధ్యమైనంత తక్కువ ఖర్చులో కాలం గడిపేందుకు ప్రయత్నించసాగింది. కాని ఖర్చుపెట్టేందుక్కూడా ఎంతో ఆలోచించవలసి వొచ్చింది.

తాను ఒక పూటే భోజనం చేసేది. ఇలా మాత్రం ఎన్నాళ్ళు గడుస్తవి కనుక? భర్త వలెనే తాను కూడా పని పాటలు చేసుకోవాలి. తన సుఖం కన్న యీ బిడ్డ–

ఆడపిల్లకు ఎలాగైనా పెళ్ళిచేసేవరకైనా తన శరీరంలోని చివరి రక్తపు బొట్టు వరకూ ఖర్చు పెట్టవలసే వుంటుంది.

ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా ఎదురింటి పుల్లమ్మ చెప్పిన సలహా నచ్చింది. పుల్లమ్మ కూడా విధవే! ఆమెకు ఒక కొడుకు వున్నాడు. వాడు కూడా ఫాక్టరీలో పని చేస్తున్నాడు. వాణ్ణి పెంచి, పెద్దవాణ్ని చేసి ప్రయోజకుణ్ణి చేసేందుకు పుల్లమ్మ ఏ విధంగా జీవిత రాక్షసితో తెగబడి పోరాడి విజయాన్ని సాధించిందో ఆ గూడెంలో వాళ్ళందరికీ తెలుసు. భర్తపోయిన దానిగా ఆమె వేరుశెనక్కాయ ఉండల్ని అమ్మి దాంట్లో వొచ్చిన లాభంతో సంసారాన్ని గడిపింది.

"ఇంతకన్న మనం చేయదగింది కూడా లేదు, వీరమ్మా! నా మాట విని నీవు కూడా నాలాగే ..." అంది పుల్లమ్మ.

"నా కదంతా కొత్త. ఎలా?" అంది వీరమ్మ.

"నేను ఉన్నానుగా! నాలుగు రోజులు నాతో తిరిగితే నీ కదంతా అర్థమౌతుంది."

వీరమ్మ ఒప్పుకుంది. ఉండలు చేయటం దగ్గర్నుంచీ నేర్చుకుంది. తోడు తోడుగా పుల్లమ్మతో పాటు నాలుగు బజార్లూ తిరగటం, ఏ విధంగా సరుకు అమ్మజూపుతూ, పిల్లల్ని ఆకర్షించి, ముద్దుగా వారితో మాట్లాడుతూ, ఉండలు వొదిలించుకోవాలో, ఏ యే బజార్లు లాభసాటిగా ఉంటవో, ఏ యే బజార్లకు పోవటం అవసరమో, మొదలైన వివిధ విషయాలు ఆమెకు వారం పది రోజుల్లోనే వంటబట్టినయ్.

కాని పుల్లమ్మతో కలిసి వెళ్ళటం తోడుగా వున్నా, వ్యాపారంలో ఒకరి కొకరు పోటీగా ఉండవలసి వొస్తుందని వీరమ్మ గ్రహించింది. అందుకని బయలుదేరడం కలిసి బయలుదేరినా, వీరమ్మ కొత్త ప్రదేశాల్లో తిరిగి సరుకు అమ్ముకొనేది. త్వరలోనే ఆమె వ్యాపారంలో తగినంత సామర్థ్యాన్ని సంపాయించింది. మూలధనం తరగకుండా రోజుల్ని వెళ్ళబుచ్చ గలుగుతోంది.

పిల్లకు పని పాటలు నేర్పింది. కాస్త విశ్రాంతి తీసుకునేందుకు వీరమ్మకు అవకాశం ఉండేది. తాను భర్త స్థానాన్ని ఆక్రమించినప్పుడు, తనకు చేదోడు వాదోడుగా కూతురు తన స్థానాన్ని ఆక్రమించింది.

ఈ ముద్దుల కూతుర్ని కని పెంచినా, ఆమెను ఒక అయ్య చేతుల్లో పెట్టక తప్పదు. ఈ ఆలోచన వొచ్చినప్పుడు వీరమ్మ కంపించిపొయ్యేది. తన జీవితం ఒంటరిగా గడపవలసిన రోజులొస్తయ్. అప్పటికి ఖర్చు తగ్గుతుంది, కాని దాంతోపాటే తనకు సహాయం, నా అన్నవాళ్ళు కూడా వుండరు. పై పెచ్చు తనకు వయస్సు కూడా పెరుగుతుంది. ఐతే కష్టాలనేవి మొదట్లో ఎంతో భయంకరంగా ఉంటవి కాని, వాటిని ఎదుర్కోసాగాక వాటికి అలవాటవక తప్పదు.

అందులోనూ యిన్ని కష్టాలతో తల ముగ్గుబుట్టయిన తనకు అదొక లెక్క కాదు. కనుక తన కూతురికి పెళ్ళిచేసి పంపివేసి, అది సుఖపడుతూన్నదనే తలపు వల్ల కలిగే ఆనందంతో, తాను బతకగలనని ఆమె, తనకు తాను ధైర్యం చెప్పుకుంది. జీవితాన్ని తాను సాధించలేకపోతే, జీవితమే తనను సాధిస్తుందనే సత్యం వీరమ్మకు తెలియకపోలేదు.

సరిగ్గా ఐదేళ్ళ క్రితం ఆమె కలలు నిజమైనవి. తన దగ్గిర ఉన్న ఐదొందలూ కట్నంగా ఇచ్చుకొని, కూతురుకు కాస్త మంచి సంబంధాన్ని తెచ్చింది. ఆమెకు పెళ్ళి చెయ్యగానే తన జీవితమే ధన్యమైందని భావించింది.

కాని కూతురు కాపరానికి వెళ్ళినప్పటి నుంచీ ఆమెకు ఒకటే దిగులు. యోగ్యుడైన భర్త, కూతురుకు దొరికాడనే సంతోషాన్ని, ఒంటరి జీవితపు దుఃఖం దిగమింగింది. తనకు కూతురు లేకుండా, కొడుకు ఉన్నట్లయితే ఎంత బాగుండేది! కాని ఇష్ట ప్రకారం జీవితం నడవదు కదా!

తన కూతురు పెళ్ళి చేసిన సంవత్సరమే పుల్లమ్మ మరణించింది. తాను కూడా త్వరలోనే మరణిస్తుంది. అప్పుడు తన ఒంటరితనం పోతుంది. ఇక కన్నకూతురా- అదెలాగూ సుఖపడుతూనే వుంది. తనకు వంద మైళ్ళ దూరంలో ఉంటే మాత్రమేం! ప్రతి రోజూ ఆమెనూ, ఆమె ఆనందాన్ని తన మనోఫలకంతో వీరమ్మ స్పష్టంగా చూడగలుగుతూనే వుంది.

అనేకసార్లు కూతుర్ని చూడాలనే తీవ్ర వాంఛ కలిగింది. కాని అంత దూరపు ప్రయాణాలు తాను చేయలేదు. అదీ గాక బోలెడు ఖర్చులు. తీరా కూతురు దగ్గరికి వట్టి చేతుల్తో పోతే ఎట్లా? వాళ్ళు పిలవందే వెళ్ళటం దేనికి? కాస్త డబ్బు కూడబెట్టుకొని, ఏ పండక్కో అల్లుణ్నీ, కూతుర్నీ పిలిపించి బట్టలు పెట్టి పంపితే సరిపోతుంది.

ఈ ఐదేళ్ళలోనూ అనేక పండుగలు వొచ్చినవి. కాని ఒక్కటీ వీరమ్మకు నిజమైన పండుగగా పరిణమించలేదు. ఆమె సంపాదన కూడా తగ్గిపోయింది. ఇదివరకల్లే ఉత్సాహం కూడా లేదు. తన ఒక పొట్టే కదా అని సరిపెట్టుకోగలుగుతోంది. ఒక్క పండక్కు గూడా ఆమె డబ్బు కూడ బెట్టలేకపోయింది.

కూతురు దగ్గర్నుంచి నెలకొకసారి ఉత్తరం వొస్తుంది. ఆనాడు వీరమ్మకు పండగే! ఎవరిచేతన్నా చదివించుకొని, జవాబు రాయిస్తుంది. మిగతా పనులు చేసుకునేందుకు ఆనాడు ఆమెకు తీరిక వుండదు. ఆ ఆనందంతోనే కడుపు నిండుతుంది కనుక, ఆమెకు మరి భోజనం చెయ్యబుద్ధవదు... కాని మర్నాడు మళ్ళీ తన గానుగెద్దు జీవితం ప్రారంభమౌతూ వుంటుంది.

ఇన్నాళ్ళూ పై పండుగకన్నా కూతుర్నీ, అల్లుణ్నీ పిలిపిద్దామనుకునే ఆశ వుండేది. ఇప్పుడది కూడా పోయింది. సెనక్కాయలూ, బెల్లం, చివరకు కట్టెల ధరలు కూడా

పెరిగిపోయినయ్. ఇదివరకల్లే గిట్టుబాటు కావటం లేదు. ఇది మానేసి యింకేదన్నా పని చేసుకునేందుకు తన శరీరంలో శక్తి ఏదీ? వ్యాపారానికి పెట్టుబడి ఏదీ? ఐనా తనకింకో వ్యాపారం ఏం తెలుసు కనుక? ఇలాగే, తన చివరి ప్రయాణం శ్మశానానికే కాని మరొక చోటుకి కాదు.

అప్పుడప్పుడు కూతురు దగ్గిరికి వెళ్దామా అనిపించేది! కాని తా నీ స్థితిలో శిథిలమైపోయిన శరీరంతో అక్కడికి వెళ్తే వాళ్ళు మాత్రం పోషించ వొద్దా? తనకు ఎంత కూతురైనా, అల్లుడికి తను పరాయిదే అవుతుంది! ఇన్నాళ్ళూ ఇంత ఓపికతో, కళ్ళలోకి రక్తం చిమ్ముతూన్నప్పటికీ, భరించగలిగిన యీ విషాద కఠిన జీవితాన్ని, ఈ చివరి ఘట్టంలో వేరొకరికి బరువుగా, భారంగా చేయటం దేనికి? తనకు ఏ మున్నా, ఏది లేకున్నా, అభిమానం యింకా చావలేదు. తన బతుకు తాను బతకాలనే పట్టుదల తనను విడనాడ లేదు. కనుకనే నేల మీద పాక్కుంటూ ఆ శ్మశానం వైపే పయనించేందుకు తను నిశ్చయించుకుంది... కాని...

“ఎవరూ?”

విసుగూ, కోపమూ చిరాకులు మేళవించిన కఠోరమైన కంఠస్వరంతో ఆమె తుళ్ళిపడింది. మెల్లిగా కళ్ళు తెరిచి, తన వైపే చూస్తున్న ఒక యువకుణ్ణి చూసింది. తనను బహుశా ముష్టిదనుకొని ఉంటాడు; కాదని తేల్చుకొని, మరొక్క మాటన్నా లేకుండా స్టూడియోలోకి వెళ్ళిపొయ్యాడు.

అతనెవరో తన ఆలోచనల్ని భంగపరిచాడు. ఇంకా నయం యీ నీడలో ఇంకాస్సేపు కూర్చున్నట్లయితే కునుకు పట్టేది. నీడలు సాగిపోయేవి, వొట్టి చేతుల్తో ఇంటికి వెళ్ళవలసి వచ్చేది. మంచిదే ఐంది మెలకువ రావటం!

నీరసంగా ఇక తప్పదన్నట్లు లేచి నిలబడింది వీరమ్మ. జంగిడీ నెత్తి కెత్తుకొని, పక్కనే ఉంచుకొన్న కర్ర చేతిలోకి తీసుకొంది. మొదట్లో యీ కర్ర కాకుల్ని తోలేందుకూ, కొంటెపిల్లవాళ్లను భయపెట్టేందుకూ ఉపయోగపడేది. ఇప్పుడు తను నడిచేప్పుడు ఆధారంగా కూడా ఉపయోగపడుతోంది!

రెండడుగులు వేయగానే స్టూడియో బైట ప్రచారానికి వేళ్ళాడేసిన ఫొటోలు ఆమె దృష్టిని ఆకర్షించినవి. పరిశీలనగా ఆమె వాటిని చూడసాగింది. ఎన్ని రకాల ఫొటోలు! ఎంత అందమైన నాజూకైన మనుషులు! ప్రతి ఫొటోలోనూ బొమ్మ కాకుండా, నిజమైన మనుషులే, ప్రాణం ఉండి, జీవశక్తిని ప్రదర్శిస్తున్నారు. కొన్ని బొమ్మల్లోనివారు తనను పలకరిస్తున్నట్లుగా కూడా వున్నది. ఆమె మరింత ఉత్సాహంతో ఆశ్చర్యంతో వాటిని చూడసాగింది!

ఒక్క యువతీ యువకులే కాదు పసిపిల్లల ఫొటోలు కూడా ఉన్నవి. ముసలివాళ్ళ ఫొటోలూ ఉన్నవి. నిత్య జీవితాల్లో వీరందరూ ఎన్నెన్ని కష్టలు పడ్డారో, ఎంతెంత

సుఖాలనుభవించారో కాని ఫొటోల్లో మాత్రం అందరూ జీవితంలో సుఖపడుతూన్నట్లే ఆమెకిప్పుడు కనిపిస్తున్నారు.

ముసలివాళ్ళేమిటి వెనకటికి గూడెంలో సుందర్రామయ్య పోతే, బతికి వుండగా ఆయన ఫొటో తీయించుకోని నేరానికి గాను, శవాన్ని ఆపించి, ఆయన్ను కుర్చీలో కూర్చోబెట్టి, పూల దండలూ అవీ వేసి అలంకరించి మరీ ఫొటో తీశారు. కాని ఆ శవాలంకరణలే ఫొటోలో కనిపించినవి.

చివరకు ఆయన కళ్ళు తెరిచిన పాపానన్నా పోలేదు కదా! కాని బతికి వుండగా ఫొటో తీయించుకొన్నట్లయితే సజీవ కళలు అందులో ప్రతిఫలించేవి!

ఆయన బతికి ఉండగా, తాను కాపరానికి వొచ్చిన కొత్తల్లో, 'పిల్లా! మనిద్దరం ఫోటో దిగాలే!' అన్నాడు; తనూ ఎంతో సరదాపడింది కాని, చివరకు ఆ ఫోటో సంగతే మరిచిపోయారు. అప్పుడు ఫోటో దిగి వుంటే ఎంత బాగుండేది! పొద్దున్నే లేవగానే ఆ ఫోటో తన మంచి రోజు లన్నిటినీ జ్ఞాపకం చేస్తుండేది కదా!

రోజులు గడిచేకొద్దీ మనుషులకైతే వయస్సు పెరిగి జీవ సత్వాలు తగ్గి, ముసలితనం వొస్తుంది కాని, ఫొటోలో ఐతే ఆ మార్పు లుండవు కదా! నిజానికి ఇప్పుడు తన కళ్ళ ఎదుట వున్న యీ ఫొటోల్లోని వ్యక్తుల్లో, చాలామంది చనిపోయి ఉండొచ్చు. కాని ఫొటోలో మాత్రం, అది రూపు మాసిపొయ్యే వరకూ, వారు సజీవులుగానే ఉంటారు. కాల చక్రపు ఇనుప చక్రాల మధ్య శరీరం నలగకుండా 'ఫొటో' కాపాడ గలదు.

– తాను కూడా ఫొటో దిగుతే!

ఈ ఊహ రాగానే ఆమె వొళ్ళు పులకరించింది. నిజంగానే ఫోటో దిగినప్పుడు కలిగే ఆనందంతో వీరమ్మ ఒక్క క్షణం కళ్ళు మూసుకుంది! తిరిగి కళ్ళు తెరవగానే తనకు ఎదురుగా వున్న ఫొటోల్లోని వారందరూ తనను, తన ఫొటోను, తమ మధ్యకు రమ్మని ఆహ్వానిస్తున్నట్లే తోచిందామెకు.

ఫొటో దిగుతే, తను ఎలా ఉంటుందో, తన పోలికలున్న ఫొటోలు ఏమిటో ఆమె వెదకసాగింది. చివరకు గంప నెత్తిన పెట్టుకొని కాయ కష్టం చేసుకునే ఒకామె ఫొటోతో, తను దిగబొయ్యే ఫొటోను పోల్చుకుంది. భేదమల్లా వయస్సులోనే వుంటుంది; ఆమె బాగా వయస్సులో ఉండగా ఫొటో దిగింది. తాను వయస్సు మళ్ళాక దిగుతోంది. ఈనాడు ఆమె బతికి వుంటే తనలాగే ముసలిదే ఐవుంటుంది అప్పు డసలు భేధమే ముంది?

ఇంకా నయం సుందర్రామయ్యలాగా తన శవానికి ఫొటో తీయవలసిన అవసరం ఉండదు. ఒకవేళ అలా జరిగినా ఆ ఫొటోను, తన ఫొటోను, తాను కళ్ళారా చూసుకునే అదృష్టమన్నా ఉండదు కదా!

చివరి మజిలీలో వున్న తను చనిపోతే, నిజంగా విచారపడే వాళ్ళు తన కూతురొక్కతే! తాను కూతురికి కలకాలం జ్ఞాపకముండాలంటే, తన ఫొటో చాలు! ఐతే ఆ ఫొటో తీయించుకొనేందుకు తనకు డబ్బు కావాలి. తన కా శక్తి లేకుంటే కూతురు తీస్తుందనేమిటి? దాని దగ్గర మాత్రం డబ్బు వుండవొద్దా? తీరా తను చనిపోయాక, ఆమె తీయించి మాత్రం ఏం ప్రయోజనం?

కనుక ఇప్పటికీ, ఇంకా అంతా మించిపోక మునుపే తను ఫొటో దిగాలి. దాన్ని కూతురుకు పంపాలి. చీరెలూ, ఇతర బహుమతులూ ఇస్తే, త్వరలోనే అవి నామరూపాలు లేకుండా పోతవి. దాంతో తనను మరిచి పోతారు. కాని ఫొటో ఐతే ఏళ్ళ తరబడిగా గోడ మీద వేళ్ళాడుతూ, తనను ఎరిగిన వాళ్ళందర్నీ పలకరిస్తూ వుంటుంది. ఈ విధంగానన్నా తన జన్మ సార్థకమౌతుంది.

ఈ ఆలోచనల్లో ఆమె కాగిపోయింది. ఏ విధంగానైనా సరే ఫొటో దిగి తీరాలని దృఢంగా నిశ్చయించుకొంది. ఫొటో దిగేందుకు ఎంతవుతుందో కనుక్కోవాలి. ఎలాగైనా కష్టపడి డబ్బు కూడబెట్టి శాశ్వతంగా కళ్ళు మూయక ముందే ఫొటో దిగాలి,

తన రూపు వికృతంగానే ఉండొచ్చు. ఐతేనేం - ప్రపంచంలో అందరూ అందమైనవాళ్ళూ, వయసులో వున్నవాళ్ళే ఉంటారా? ఎవరెలాగున్నారో, ఫొటోలు కూడా అలాగే ఉంటవి. అలా ఉండకుంటే, అసలు గుర్తించటం సాధ్యమా? దానికి విచారపడటం దేనికి?

తన యీ వాంఛను బైట పెట్టి, ఎంతిస్తే ఫొటో తీస్తారో కనుక్కొనేందుకు, ఏం చెయ్యాలా అని ఆమె ఆలోచిస్తూంది. లోపల మనుషులున్నారు... కాని లోపలికి వెళ్ళేందుకు ఆమెకు భయం వేసింది. ఎవరైనా బైటకొస్తే బాగుండును.

ఇలా అనుకుంటూండగానే ఖరీదైన దుస్తులు వేసుకున్నతను, ఇందాక తనను పలకరించి వెళ్ళిన అతనే బైటికి వొచ్చాడు. తానింకా ఆ ప్రాంతాల్లోనే ఉన్నందుకు, తనను ఎగాదిగా చూశాడు. తనేమన్నా దొంగ అనుకున్నాడేమో?

మళ్ళీ అతను లోపలికి వెళ్ళిపోక ముందే అంతా తేల్చుకోవాలి. తను ఫొటో దిగాలనేది ఎంత న్యాయమైన కోర్కె ఐనా, వినే వాళ్ళకు వెగటు గానూ, హాస్యాస్పదంగానూ తోచవచ్చు. అందుకనే తాను సిగ్గుపడి ఛస్తోంది. కాని ఇప్పుడు ఫొటోలు తీసే అత నొక్కడికే తాను చెప్పుకొనే అవకాశం, నలుగురిలోనూ భంగపాటుపడకుండా వుండే అవకాశం చిక్కింది.

అందుకని "బాబూ! ఇక్కడ ఫొటోలు తీస్తారా?" అంది వీరమ్మ.

ఆ యువకుడు వీరమ్మను విచిత్రంగా చూస్తున్నాడు. ఇది గ్రహించి వీరమ్మ ఓపిక తెచ్చుకొని నిటారుగా నిలబడేందుకు ప్రయత్నించింది.

"ఔను" అన్నాడా యువకుడు. "ఎవరికి తీయాలి?"

ఎవరైతేనేం? యీ ప్రశ్న వీరమ్మకు నవ్వు తెప్పించింది. కాని నవ్వితే, తను మాట్లాడేదంతా ఎగతాళి కిందకే దిగుతుందని భయపడిందామె.

"నాకే బాబూ!... ఫొటో దిగి, అమ్మాయికి పంపుకోవాలి!" అంది వీరమ్మ, తన చరిత్రంతా ఆ యువకుడికి తెలిసి వుంటుందనే పిచ్చి నమ్మకంతో

ఆ యువకుడు పగలబడి నవ్వబోయి, తమాయించుకున్నాడు. ఒక్కసారి వీరమ్మను చూసి జాలిపడ్డాడు. అంతకన్న ఆమె ముఖంలో కనిపించే ఆతృత, పట్టుదల గాఢవిశ్వాసం మొదలైన వాటితో ఇంప్రెస్ అయ్యాడు.

"ఎంతవుతుంది బాబూ?" అంది వీరమ్మ.

"ఒక్క కాపీ ఐతే నాలుగు రూపాయలు... రెండు కాపీలైతే ఐదు రూపాయలు."

కాపీలంటాడేమిటి? తాను కాఫీ తాగుతూ ఫొటో దిగుతుందనుకొంటున్నాడా యేం?

"నేను కాఫీ తాగాలా బాబూ! ఆ అలవాటు నాకు లేదు" అందామె.

ఆమె పడుతూన్న పొరపాటును అతను గ్రహించాడు.

"కాఫీ కాదు... ఒక బొమ్మ కావాలంటే నాలుగు రూపాయలు. రెండు బొమ్మలు కావాలంటే ఐదు రూపాయలు--" అన్నాడతను.

ఆ మాటల్ని వీరమ్మ మననం చేసుకుంటోంది. ఆమె యింకా వొదిలి పోదేంటా అని చూస్తున్నాడా యువకుడు.

"డబ్బు తీసుకుని రా-" అని, ఇంకా నిలబడితే ఈ న్యూసెన్సు వొదలదేమోననే భయంతో లోపలికి వెళ్ళిపోయాడు.

వీరమ్మకు అడగవలసిన ప్రశ్నలు మాత్రం ఏమున్నవి కనుక? తనకు ఒక్క బొమ్మే చాలు. ఇంకో బొమ్మ కావాలంటే మరో రూపాయి అవుతుంది, ఆ ఒక్క బొమ్మయినా కూతురికే కాని, తన కెందుకూ? ఎలాగైనా ఈ నాలుగు రూపాయలూ సంపాయించాలి. చీరె కొనాలంటే కనీసం ఆరు రూపాయలన్నా అవుతుంది. ఫొటో నాలుగే! ఇంత చౌకగా ఫొటో తీస్తారని కూడా ఆమె ఇదివరకెన్నడూ అనుకోలేదు. ఈ ఊహ ఇదివరకే వొస్తే, తన కోర్కె చాలా తేలిగ్గా తీరేది. ఇప్పుడైతే మాత్రమేంలే పస్తులుండయినా సరే, ఆ నాలుగూ సంపాయించి ఫొటో దిగాలి...

ఈ నిశ్చయం ఆమెలో వేళ్ళు తన్నుకుంది. తన జన్మ సార్థకత కోసం, వొంట్లో వున్న కొద్ది శక్తినీ ద్విగుణీకృతంగా పని చేయించే ఉత్సాహం ఆమెలో పొడసూపింది.

ఆటవిడుపు సమయాన్ని గుర్తుకు తెచ్చుకొని వీరమ్మ స్కూలు వైపు చకచకా నడవసాగింది. తనకింత శక్తి ఇంకా మిగిలి వున్నదనే సంగతి కూడా ఆమె ఇప్పుడే తెలుసుకుంటోంది. దీనితోనే ఆమె తన కోర్కెను తీర్చుకో గలననే ధైర్యాన్ని కూడా పొందింది.

## 2

ఆ తరువాత రెండు నెలలూ వీరమ్మ జీవితంలో ఎన్నడూ అనుభవించనన్ని కష్టాలు పడింది. ఆమె బతుక్కు రోజూ ఒక్క అణా ఆదా చేయడమంటే మాటలు కాదు. ఒకోనాడు అన్నం లేకుండా నీళ్ళు తాగి గడిపింది. ఒక రోజు రెండు పూటలు జంగిడీ వేసుకొని కాళ్ళీడ్చుకుంటూ బజార్లలో తిరిగింది. ఆ ఫొటో తీయించుకునేవరకే తన కీ కష్టాలు. ఆ జీవితాశయం నెరవేరేందుకు ఆమె ఈ కష్టాలన్నిటినీ వరించింది.

ఎలాగైతేనేం నాలుగు రూపాయలు కూడబెట్టింది. ఆ చిల్లరంతా లెక్క పెట్టినప్పుడు ఆమె ఆనందానికి మేరలేదు. ఇవాళ ఎలాగైనా ఆ ఫొటోలు తీసే చోటుకు వెళ్ళి, తనూ ఫొటో దిగాలి.

దిగబొయ్యే ఫొటో ఎలా వుంటుందో ఆమె ఊహించుకోలేకపోయింది. ఇంట్లో అద్దమన్నా లేదు. తాతల కాలం నాటి అద్దాన్ని కూతురికి ఇచ్చింది. తన పాపను చూసుకోవాలి!

కుండలోని నీళ్ళలోకి తొంగి చూసింది వీరమ్మ. ముడతలు పడిన ముఖం, ముగ్గు బుట్టలాటి అట్టలు కట్టిన శిరోజాలు, నవ్వితే బైటపడే తొర్రిపళ్ళు నిజంగానే తనెంత మారిపోయింది! ఇప్పుడు కూతురు తనను చూసినా చప్పున గుర్తుపట్టలేదు. ఐతేనేం ఆ ఫొటో చూశాక అమ్మను చూసినంత ఆనందంతో ఆ చిన్నది గంతులు వేస్తుంది. తను అందగత్తె కాకుంటేనేం ఆ కూతురికి తల్లి కాకుండా పోతుందా?

అమితానందంతో వీరమ్మ పనులన్నీ ముగించుకొంది. నిన్న సాయంత్రం ఉతుక్కున్న చిరుగుల చీరె కట్టింది. నీళ్ళతో తల వెంట్రుకల్ని తడిపింది. కాని, వాటి బిరుసుతనం పోలేదు. చన్నీళ్ళతో ఒక్కసారి మొహం కడుక్కుంది. ఇంతకన్న అలంకరణలు అనవసరం. స్టుడియో వైపు విజయపూర్వకమైన నడక సాగించింది

స్టూడియో గుమ్మంలోకి వచ్చేటప్పటికి ఆమె ఉత్సాహమంతా మాయమైంది. బైటనే తనకు ఆహ్వానమిచ్చేందుకు అతను – ఆ యువకుడు ఎదురవుతాడనుకొంది. బయట ఎవ్వరూ లేరు. కాసేపు అలాగే నిలబడింది.

లోపల నుంచి నవ్వులు, ఏవేవో తనకు అర్థంకాని మాటలు వినిపిస్తున్నవి. లోపల చాలామంది వుండి వుంటారు. వాళ్ళందరి మధ్యకు వెళ్ళేందుకు ఆమెకు

ధైర్యం చాలలేదు. పోనీ ఆ అబ్బాయి – అతన్ని గుర్తుపట్టగలదు కాని, అతని పేరన్నా తెలియదాయె. ఎలా అతన్ని పట్టుకోవటం?

చాలాసేపటిదాకా ఎవరైనా వస్తారేమో, తనను పలకరిస్తారేమోననే ఆశతో, ఆమె అక్కడే నిలబడింది. ఎవరో ఒకరిద్దరు లోపలికెళ్ళటం, ఇద్దరు ముగ్గురు బైటికి రావటం జరిగింది కాని, వాళ్ళెవ్వరూ తనను గమనించనూ లేదు. వారిలో తనకు కావలసిన ఆ అబ్బాయి లేనూలేడు.

చివరకు ఎలాగైతేనేం తనకు తాను ధైర్యం చెప్పుకుంది. తనేమన్నా నేరం చేస్తున్నది కనుకనా భయపడేందుకు! డబ్బిచ్చి ఫొటో తీయించుకోవాలనుకొనే ప్రతీవాళ్ళకూ యిక్కడ గౌరవం ఉంటుంది. ఎవరేమనుకుంటే తనకేమి లెక్క? తనకు కావలసిందల్లా తన ఫొటో.

ఆమె యిక ఆగలేకపోయింది. ఆతృత దహించి వేస్తూంది. ఎలాగో ధైర్యంగా, జాగ్రత్తగా, అడుగులువేసుకొంటూ లోపలికి జొరబడింది.

కొంచెం దూరం చీకటి సందు, ఆ తరువాత పెద్ద హాలు. కళ్ళు మిరుమిట్లు గొలిపేట్టుగా లైట్లు వెలుగుతున్నవి. నేలమీద మెత్తని తివాసీ పరిచి వుంది. కుర్చీలలో, సోఫాలలో ఏడెనిమిదిమంది చాలా ఐశ్వర్యవంతులే ఐ వుండాలి. కూర్చొని చాలా సరదాగా మాట్లాడుకుంటున్నారు. స్వర్గం సంగతి ఎవరో అనుకుంటుండగానూ, కథల్లోనూ విన్నదామె. బహుశా ఆ స్వర్గం – తను చచ్చాకన్నా చూడలేని ఆ ప్రపంచం, ఇలాగే ఉంటుందేమో?

ఆమె అవతారాన్ని చూడగానే మాట్లాడుకొనేవాళ్ళందరూ నోళ్ళు మూసుకొన్నారు. కాని నోళ్ళు సగానికి తెరిచి ఆశ్చర్యంగా ఆమె వైపు చూడసాగారు. వెనువెంటనే ముష్టిదెవరో ధైర్యంచేసి లోపలికి జొరబడి, తమ సంస్కారానికీ, నాగరికతకూ భంగం కలిగించినందుకు వారందరూ ఒకేసారి మండిపడ్డారు.

"ఫొ...ఫో... అరేయ్! వెంకాయ్! ఎవర్రా ఇది... దీన్ని ముందు బైటికి గెంటు,..." మొదలైన మాటలు, ఏదో గొప్ప ప్రమాదం వాటిల్లినప్పుడు, ఎవరికి తోచిన కేకలు వాళ్ళు వేసినట్లుగా హాలు ప్రతిధ్వనించింది.

వీరమ్మ ఈ మాటల్ని వినిపించుకోవటం లేదు. ఆ అబ్బాయి తనతో మాట్లాడిన ఆ అబ్బాయి కోసం ఆమె కళ్ళు ఆతృతతో వెదుకుతున్నాయ్.

"బాబూ!" అందామె ప్రశాంతంగా. "ఆ అబ్బాయి ఫొటో తీసే అబ్బాయి యెక్కడ?"

వెంకాయ్‌గాడు వచ్చాడు కాని, ఆమె మాట్లాడుతుండటం వల్ల, గెంటి వేసేందుకు మరొకసారి అనుమతి కోసం సిద్ధంగా ఉన్నాడు.

ఇది ప్రమాదం కాదని తెలుసుకొన్నాక, అక్కడ జేరిన పెద్ద మనుషులు కాస్త స్థిమితపడ్డారు.

"ఎవరూ? ఎందుకూ?" అన్నాడొకాయన.

"అదే బాబూ! నాలుగు రూపాయిలిస్తే ఫొటో తీస్తానన్నాయన... డబ్బు తెచ్చుకొన్నాను!" అంది వీరమ్మ.

"ఫొటోనా?... నీకా?"

అందరూ పగలబడి నవ్వారు.

"భలే మోడల్ సుమా రాజా! ఎకాడమీ ఎవార్డు వొస్తుందేమో చూడు" అన్నాడొక పెద్ద మనిషి.

"దేశ దారిద్ర్యానికి ఇంతకన్న మంచి సబ్జక్టు మరి ఉండదు-" అన్నాడు మరొకాయన.

వీరమ్మకు మాత్రం వాళ్ళేమనుకుంటున్నారో సరిగ్గా అర్థం కాలేదు. కాని, మానవ భాష కూడా తెలియని పశువులు సైతం, ఆ కంఠస్వరాన్ని బట్టి, అదిలింపుల్ని అనుసరించి, మానవుడికి వశమై , అతని యిష్టానుసారంగా సేవ చేస్తూనే ఉన్నవి - అలాటి పశుత్వమే వీరమ్మలో కూడా పని చేసి ఉండాలి. వాళ్ళు తనను అసహ్యించుకొంటున్నారనీ, తనను ఎగతాళి చేస్తున్నారనీ ఆమె గ్రహించింది. కానీ వీళ్ళేమనుకొంటే తనకేం లెక్క? తనను మనసారా ప్రేమించిన తన కూతురున్నది. అదే తన ప్రపంచం. ఆ ప్రపంచంలోకి వీళ్ళెవరూ జొరబడలేరు తన హృదయాంత రాళంలోని ఆ ఆనందాన్ని వీళ్ళు లాక్కోలేరు, వీళ్ళతో తన పనల్లా ఫొటో తీయించు కోవటం--అంతే!

"ఏం బాబూ!...ఫొటో...!" అంది వీరమ్మ.

కాని ఆమె మాటలు ఎవరూ వినిపించుకొంటూన్నట్లు లేదు. వారి ప్రపంచంలో వారు తమ సమానుల్ని మాత్రమే జేరనిస్తూ మాట్లాడుతూన్నట్లున్నారు.

"యీ ముష్టిదానిక్కూడా ఫొటో! ఆర్టు ఏ గతికి దిగిందిరా బాబూ!" అన్నాడొక కళారాధకుడు.

"దీనికి పిచ్చెక్కింది--"

"వెళ్ళవమ్మా వెళ్ళు... ఇక్కడ ఫొటోలు తీయరు!" అన్నాడు మరొకడు, కనుబొమ్మలు చిట్లిస్తూ.

"పదవమ్మా" అన్నాడు వెంకాయ్, ఆమె మీద చేయి వేస్తే, తరువాత సబ్బుతో కడుక్కోవాల్సి వొస్తుందేమోనని అనుమానిస్తూ.

"ఫొటోలు తీయరా? ఆ బైట వున్న వాళ్ళందరికీ తీశారే! ఆ అబ్బాయి కూడా తీస్తారని అన్నాడే!" అంటోంది వీరమ్మ.

"నీ అందానికి ఫొటో కూడా దేనికి? కూడులేక ఛస్తూ యీ సరదా లెందుకు... వెళ్ళు, ముందు యిక్కణ్నుంచి ఫో...!"

వీరమ్మకు నిజంగానే మతిపోయినంత పనయింది. ఆమెకు తెలియకుండానే చేతిలోని కర్ర నేల మీద పడింది. వెంకాయ్ ఆ కర్ర అందుకొని, దాంతోనే ఆమెను బలవంతంగా బైటికి నడిపించాడు.

"ఖరీదైన కెమెరా ఖరాబయ్యేది" అన్నాడొకడు.

"పిశాచాలు నాట్యం చేసే ఆ మొహం చూడు. తలుచుకొంటే, అన్నం కూడా సహించదు."

"ఈ ఆర్టు ప్రతి డొక్కు వెధవకూ అందుబాటులోకి తేవాలంటాం కాని, అలా తెస్తే దాని సౌందర్యం, యీ ప్రపంచంలోని సౌఖ్యమే నేల పాలవుతుంది!"

"సరిగ్గా చెప్పావ్.. కళ... కళాహృదయులకే చెందాలి. ప్రతి నాపకూ కళ దేనికంట?"

ఈ విధమైన చర్చలు లోపల సాగుతూన్నవి.

వీరమ్మ, దాదాపు పగిలిన గుండెతో, స్టుడియో బైట ఇక నడవలేక కూలబడింది. తనెంత అల్పజీవి! ఇన్నాళ్ళూ తనను తాను అసహ్యించుకోలేదు. కాని, ఇప్పుడు నిజంగానే తనను తాను అసహ్యించుకో సాగింది. తన పాడుమొహంతో ఫొటో దిగేందుకు వెళ్లటం ఒక నేరమనే సంగతి ఎన్నడూ అనుకోలేదు. ఇప్పుడది నమ్మకంగా తేలిపోయింది.

ఐతే తన బతుకంత అధ్వాన్నమైనదా? తను యాచకురాలన్నా కాదే! చచ్చిన శవాలక్కూడా ఫొటోలు తీస్తున్నారే! తాను శవంకన్నా హీనురాలా? ఈ వెధవ మొహమంటే తనకూ ఇష్టం లేదు. కాని దీన్ని వొదిలించుకోవటం ఎలా? ప్రాణం పొయ్యాక కూడా ఇది పోదు! భూస్థాపితమయ్యాక, ఎవ్వరికీ కనిపించకుండా క్రమంగా మట్టవుతుంది.

తనేం చేయగలదు? ఇంత చిన్న కోర్కె కూడా జీవితంలో తీరకుంటే ఈ జన్మ వ్యర్థం! ప్రపంచమంతా ఏవగించుకొనే యీ మొహాన్ని ప్రేమించే వాళ్ళు ఒక్కరే – తన కూతురన్నా వుంది! కనీసం తన పట్ల సానుభూతితో, దయతో డబ్బుకు ఫొటో తీసేందుక్కూడా వాళ్ళు నిరాకరించారు. పెంపుడు కుక్కల్నీ, పిల్లల్నీ, పిల్లుల్ని కూడా ఫొటో తీస్తున్నారే! యీ బైట వేళ్ళాడేసిన వాటిల్లో ఒకామె, బొచ్చు కుక్కను వొళ్ళో కూర్చోబెట్టుకొని మరీ ఫొటో దిగింది. తా నా వెధవ కుక్క కన్న హీనంగా వుందా?

ఇలాటి అనేక ప్రశ్నలు ఆమెకు ఊపిరి సలపనీయ లేదు. ఐతే వీటన్నిటికీ జవాబులు చెప్పే తీరిక ఎవరికున్నది? కళావేత్తలూ, కళాకారులూ, కళారాధకులూ చర్చించవలసిన ముఖ్య విషయాల్లో దీనికి స్థానమేది?

వీరమ్మ సమస్య తీరలేదు. ఇక తీరుతుందనే ఆశ కూడా లేదు. తాను పస్తులు పడుకొని సంపాయించిన ఈ నాలుగు రూపాయిల చిల్లర - తన సర్వదాస్తీ నిష్ప్రయోజనం!

బాగా చీకటిపడిన తరువాత, వీరమ్మ విచారభారాన్ని కూడా మోయలేక మోయలేక, నడక సాగించింది.

## 3

ఆనాటి నుంచి వీరమ్మ దిగులుతో మంచ మెక్కింది. ఇరుగు పొరుగులు పలకరించి వెళ్తూనే ఉన్నారు. కాని తన కోర్కెను మాత్రం వీరమ్మ ఎవరికీ చెప్పదలచ లేదు. పెద్ద చదువు సంస్కారాలున్న పెద్దమనుషులే, తనను అర్థం చేసుకోలేకపొయ్యారు; ఇక ఈ పాటక జనానికి తనెలా అర్థమవుతుంది?

'జీవితపు చివరి మజిలీ' అనుకుంటూనే రోజులు వెళ్ళబుచ్చుతోందామె. ఫొటోకని దాచుకున్న డబ్బుతో కళ్ళు మూసుకొని కాలం గడపసాగింది. అదీ పూర్తయాక తిరిగి దినచర్యలోకి దిగక తప్పలేదు: ఈ బతుకు చాలించాల్సిన సమయమని ఆమెకు తెలుసు. జీవితంలో మరేమీ మమకారాలు లేవు. చివరకు కూతుర్ని చూద్దామనే తీవ్ర వాంఛతో కూడా ఇప్పుడు బాధపడటం లేదు. ఒక గొప్ప కష్టం, అంతకన్న చిన్న చిన్న కష్టాల్ని మరపింపజేసినట్లు, ఈ నిరాశాఘాతం, మిగతా ఆశల్ని కూడా అతి స్వల్పమైనవిగా చేసింది.

ఆరోగ్యం బొత్తిగా బాగా లేదు. కూర్చుంటే లేవలేని స్థితిలో కూడా తా నీ భూమి మీద పాకులాడటం తప్పటం లేదు. ఆ మరణమే ఆసన్నమైతే బాగుండు!

మరీ రెండు రోజులుగా గంజి తాగి గడిపింది. ఇవాళైనా ఆ మిగిలిన వేరుసెనగ ఉండ లమ్మి, ముద్ద తినందే ప్రాణాలు నిలవవు. అందుకనే జంగిడీ నెత్తికెత్తుకొని బయలుదేరింది.

అడుగులు పడటంలేదు. కళ్ళు బైర్లు కమ్ముతున్నవి. మతి చలించినట్లుగా, దేని మీదా దృష్టి నిలవటంలేదు. ఏడ్చి ఏడ్చి కార్చిన కన్నీరంతా ఇంకిపోయినట్లు కనిపించినా, నిజానికది గడ్డ కట్టి, తన కళ్ళకు పొరలల్లే, దట్టమైన తెరలల్లే అడ్డం పడుతూన్నది. మరణ మాసన్న మైనప్పుడు కనిపిస్తవని చెప్పుకొనే భీకరాకారాలు కూడా ఆమె ముందు భరత నాట్యం చేస్తున్నవి.

అయినా ఆమె నడుస్తూనే వుంది. శారీరకం, మానసికం అనే విభాగాలు వేటికి అవిగా కూడా, పని చేయగలుగుతవని రుజూ చేసుకోదలచిన శాస్త్రకారులకు, వీరమ్మ ఈ స్థితిలో తప్పక సహాయపడగలదు.

బజార్లో హడావిడిగా నడూస్తున్న మనుషులూ, తమ జీవితాలు శాశ్వతం కాదు కనుక, త్వర త్వరగా పనులు చేసుకోవాలనే ఉద్దేశ్యంతో అతి వేగంగా పరుగులెత్తే రకరకాల వాహనాలూ – ఏవీ వీరమ్మ దృష్టిని ఆకర్షించటంలేదు. ఈ జంగిడీలోని ఉండలు డబ్బయి, పొయి మీదికి కుండ ఎక్కి ఇంత అన్నం కడుపులో పడటమనే సమస్యే సాలెగూడల్లే ఆమె కళ్ళ ముందు అల్లుకుంది. అదే దృష్టితో నడుస్తూండటం వల్ల చక్కగా సాగిపొయ్యే ట్రాఫిక్‌కు ఆమె అడ్డుపడుతూనే ఉంది.

వెనుక నుంచి పెద్ద బరువులు వేసుకున్న లారీ శరవేగాన వొస్తోంది. ఆమె నడుస్తూన్నదల్లా హఠాత్తుగా పక్కకు కాలు వేసింది. లారీవాడు చెవులు పగిలేట్లుగా హారన్ మోగించాడు. సర్వ శక్తులతోనూ బ్రేక్‌తొక్కాడు. బహుశా వీరమ్మ పాడుమొహం చూసేందుకు మరణదేవత కూడా ఏవగించుకొని ఉండాలి. అందుకనే వెనుక నుంచి ఎదుర్కొన్నది. ఈ సంగతి గ్రహించి, వీరమ్మ తొట్రుపాటుతో, తొందరలో తప్పుకోవాలని ప్రయత్నించి, కాళ్ళు తడబడి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది.

ఇంతకూ లారీవాడు అదృష్టవంతుడు. లారీ సరిగ్గా ఆమెకు రెండంగుళాల ఎడంతో ఆగింది. ఆమె లారీ గుద్దటం వల్ల పడలేదు. అది స్పష్టంగా తెలుస్తూనే వుంది. చూసినవాళ్ళు కూడా ఆ మాటే అంటున్నారు. ఆమె తనంతట తానే పడింది. అదేవిధంగా తనంతట తానే లేస్తుందని అనుకున్నారు. కాని ఆమె లేవలేదు.

జనం పోగయ్యారు. ఒకరిద్దరు సహాయం చేసి ఆమెను లేపేందుకు ప్రయత్నించారు. కాని నలుగురుంటేనే కాని ఆమె జీవితపు అంత్య ఘట్టమైన శ్మశానానికి చేరదని తేలిపోయింది.

గంటయ్యాక పోలీసులు వొచ్చారు. లారీవాడిది తప్పు లేదని నిర్ణయించి, వాణ్ణి వొదిలేశారు. చుట్టూ జేరిన జనంలో అందరూ ఆమె పట్ల సానుభూతిని చూపినవారే! మామూలుగా ముసలిదాని దగ్గిర వేరుసెనగ ఉండల్ని కొనుక్కునే బడిపిల్లలు ఆమెను గుర్తు పట్టారు. 'నా' అన్న వాళ్ళెవరన్నా వస్తారేమోనని పోలీసులు వేచి ఉన్నారు.

మరో గంటకల్లా 'నా' అన్నవాళ్ళొచ్చారు. వీరిలో ప్రముఖ రాజకీయ నాయకులు కూడా ఉన్నారు. వొస్తూ వొస్తూ ఫొటోగ్రాఫర్ను కూడా వెంట పెట్టుకొచ్చారు. జనాన్ని తప్పుకోమన్నారు. యథాతథంతా వీరమ్మను అనేక కోణాల నుంచి ఫొటోలు ఎత్తారు.

ఫొటోలు తీసినతను ఆమెను గుర్తుపట్టాడు. ఆనాడు ఆమె డబ్బు చెల్లిస్తానన్నా ఆమెను ఫొటో తీసేందుకు అతను నిరాకరించాడు. ఈనాడు తానొక గొప్ప పని

చేస్తున్నట్లు గర్వంగా ఫొటోలు తీస్తున్నాడు. ఆనాటి ఆమె పాడుమొహానికి ఒక్కటంటే ఒక్క ఫొటో తీయలేదతను. యీనాడు అదే పాడుమొహాన్ని రకరకాలుగా తీస్తున్నాడు. బతికి ఉండగా ఫొటో తీయించుకో లేకపోయింది వీరమ్మ. కాని చచ్చాక ఎన్నో రకాల ఫొటోలు దమ్మిడీ ఖర్చు లేకుండా తీయించుకోగలిగింది.

శవ పరీక్షలో కూడా ఆమె 'షాక్' వల్లా, అంతకన్నా ఆకలివల్లా చనిపోయిందని తేలింది.

ఫొటోలు తీయటంతో రాజకీయ నాయకుల పని కూడా పూర్తయింది., ఆ శవాన్ని అక్కడే వొదిలి, దేశాన్ని మరామ్మత్తు చేసేందుకు హుటాహుటిగా వెళ్ళిపోయారు వారు.

మర్నాడు అన్ని పత్రికల్లోనూ 'ఆకలి చావు' అన్న శీర్షిక కింద వీరమ్మ ఫొటో పడింది. కొన్ని లక్షల ప్రతుల్లో ఆమె పాడుమొహం అచ్చయింది. కొన్ని కోట్లమంది చూశారు. రాజకీయ ప్రతిపక్ష వర్గాలవారు, ఈ ప్రభుత్వంలోని లోపాలనూ, ముఖ్యంగా ప్రజలు అన్నంలేక ఛస్తూన్నా, ముక్కు మూసుకొని కూర్చునే ధోరణినీ తీవ్రంగా విమర్శించారు.

చివరకు అసెంబ్లీలోనూ, పార్లమెంట్‌లో కూడా వీరమ్మ ప్రశంసా, ఆమె ఫొటో చర్చించబడినవి. ఆహార శాఖ మంత్రివర్గాలవారికి, బతికి ఉండగా భారమనిపించని వీరమ్మ, చచ్చి, పచ్చి వెలక్కాయగా పరిణమించింది!

– *జనవరి 1957*